

గడియారం పది గ

ఆ ఆసుపత్రి


వేసుకుని కళ్ళు మూ

ఉన్న మనందుకు ఆ గ

చాయి. వాతావరణం

తంగా ఉన్నది.

వివిధాలయిన మొక్క




దీపావళి కథల పోటీలో

# మొదటి బహుమతి పొందిన కథ

కొట్టింది.
గోడ కిటికీలగా కుర్చీ
వేసుక్కూ వాలి కూచుని
కలలో వలె వినిపిం
విశృంఖలంగా, ప్రశాం
ముందున్న ప్రదేశంలో
యి. సిగ్గుతో కుంచిం
కంతోపాటి వలె మెల గా

తెరలు తెరలుగా వీస్తున్న గాలి మొక్కలను విర బూచిన పూల పరిమళాన్ని సున్నితంగా మోసుకు వస్తున్నది. పాలసముద్రంలా పరుచుకున్న పండు వెన్నెల కొమ్మలపై, రెమ్మలపై పడి మనోహరంగా ప్రతిఫలిస్తున్నది.

కాని,

సునందకు అదేమీ అనుభవం కావడంలేదు.

అచేతనురాలిని చేసివేసింది. ఆ వేదన అనుభవించటం ఆమెకు దుర్భరమవుతున్నది.

అది జరిగి పదిహేను రోజులు కావస్తున్నది.

ఆనాడు యథాప్రకారం డ్యూటీలోకి రాబోయిన సునంద తన ఇంటి గుమ్మంలో ఎదురైన వ్యక్తిని చూసి నవ్వుతూ పలుకరించబోయి అతడి వాలకం చూసి "లోపలకు రండి" అన్నది. దగదడ కొట్టు

ఎదురుగా కనిపించిన కుర్చీలో కుప్పలా కూలిపోయాడు. ఒక్క క్షణం తరువాత అతను కుమిలి కుమిలి ఏడువసాగాడు. సునంద గుండెలు బేజారయిపోయినాయి. భయపడిన విపరీత పరిణామం ఎదురైందన్నమాట? కాని గత రెండు సంవత్సరాలుగా ఆమె గడిపిన జీవితం బాధలను, దుర్వార్తలను చిత్తస్థైర్యంతో ఎదురుకోగల ధైర్యాన్ని ఇచ్చింది. అందుచేత అతనికన్నా ముందే సంబాళించుకుని "ఏమయింది రాజారావుగారూ ?" అన్నది గాద్గదికతను సాధ్యమైనంతవరకూ అదుపులో ఉంచుకుని.

రాజారావు కుమిలి కుమిలి రోదించాడు. తానేం చేస్తున్నదీ తనకే తెలియని ఆ స్థితిలో సునంద రెండు చేతులూ పట్టుకుని అందులో తలదాచుకుని రోదించాడు. అతని దుఃఖోపశమనానికి మార్గం లేదు. కాని తన ధర్మం తట్టి లేపగా "మరీ అలా చిన్నపిల్లాడిలా బేజారయిపోతారేం ? ఏమిటో చెప్పండి ?" అన్నది. అన్నదే గాని ఆమెకూ ఆ వార్తను వినగలనన్న ధైర్యం లేదు. చిత్తస్థైర్యం ఎందుకూ కొరగాకుండా పోయే స్థితి అది. అయినా ఆ మాట అతని నోటివెంట వినితీరాలి. అలా కాకుండా, తాను చెప్పగల ఉపశమనపు మాటలు ఏమీ లేవు. తాను అనుకుంటున్నది కాకపోవచ్చును కూడా.

రాజారావు వొణుకుతూన్న చేతులతో జేబులోనుంచి ఓ కవరు తీసి ఆమె చేతిలో ఉంచాడు. మరుక్షణాన ముఖాన్ని దాచుకుని బావురుమన్నాడు. సునంద గుండె దిటవు చేసుకుని ఆ కవరు తెరిచింది. అది ఒక టెలిగ్రాం. అందులో—

'సుందరం పోయాడు. వెంటనే రా' అని ఉన్నది.

ఆ సంగతి జ్ఞాపకం రాగానే ఆ క్షణాన ఎంత వొణికిపోయిందో అంతకు మించి గజగజ లాడిపోయింది సునంద.

ఆ దారుణమైన సంఘటన జరిగి పదిహేను రోజులు కావస్తున్నది. ఇంతవరకూ ఆవార్త తనకూ, రాజారావుకూ, ఫస్ట్ సర్జన్ ఫెర్నాండెజ్‌కూ తప్ప మరొకరికి తెలియదు—తెలియకూడదనే నిబంధన ఉన్నది గనుక. ముఖ్యంగా 'ఆమె'కు తెలియదు; తెలియరాదు.

ఒక రహస్యం, అది తెలుసుకోవలసిన అవసరమూ, హక్కూ, ఉన్నవారి నుంచి దాచటంకన్నా మనసును వేధించే సమస్యలు తక్కువగా ఉంటాయి. నవమాసాలు మోసి, కని, పెంచిన మాతృమూర్తికి ఆమె ప్రాణాధికంగా ప్రేమించే కుమారుడు మరణించాడన్న వార్త ఎంతటి బలీయమైన అఘాతం అవుతుంది ? అందుకు తోడుగా ఆ వార్త ఆమె వినటానికి వీలులేని పాపిష్టి పరిస్థితి ఏర్పడితే ఆ రహస్యం తెలిసినవారు పడే సంక్షోభానికి అంతు ఉండదు. విధ్యుక్తధర్మానికి సరిహద్దులు నిర్ణయించగల ఆ సన్నివేశంలో తానూ ఒక పాత్ర ఇప్పుడు.

అది—ఆమె—అతను ......

ఆమె జ్ఞాపకం తెచ్చుకోకుండా ఉండలేకపోయింది.

# మమత

ఆమె పేరు పార్వతమ్మ.

నెల రోజుల క్రిందట ఆ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరింది. వారిది విజయవాడ. ఆమె ముత్తయిదువ. వయస్సు యాభై దాటక పోయినా ఆమె గుండె బలహీనమై పోయింది. అందుకు తోడుగా గర్భకోశంలో ఏదో వ్రణం సంభవించింది. ఆమెను చూసిన మొదటి క్షణాన సునందకు ఏ రకమయిన అనుభూతీ కలుగలేదు. ఆమె మాత్రం ఆప్యాయంగా "నీ పేరేమిటమ్మా ?" అన్నది.

సునంద చెప్పింది.

"బంగారపు బొమ్మలాగున్నావు. మీది ఈ ఊరేనా ?"

"కాకినాడ" అన్నది సునంద.

"అలాగా ?" అని ఆమె వంక పరీక్షగా చూసి "ఏం వర్ణం ?" అన్నది.

సునందకు ఆ ప్రశ్న అంత క్రితం వరకూ జవాబివ్వదగినదిగా కనపడలేదు. కాని ఆమెయందు తన భావాలు మారటం అప్పటికే ప్రారంభమైందో ఏమో "సమాధానం" చెప్పింది నిర్లిప్తంగా.

**అదివరకు ఆమె నడుము కొలత ఇరవై ఆరు అంగుళాలు. ఏడుగజాల చీరె చాలేదికాదని ఫిర్యాదుచేస్తూండేది. దరిమిలాను ఆమె నడుముకొలత ముప్ఫై ఏడంగుళాలు. ఐనా నాలుగు గజాల చీరె పెద్దదైపోయిందని పేచీ పెడుతున్నది. దీని భావమేమి తిరుమలేశ?**

**జవాబు: అదివరకు సినిమాల్లో వేసేదికాదు. ఇప్పుడు స్టారు ఐపోయింది.**

(ఎం. సుజాత)

"ఎవరమ్మాయివి ?" అన్నదామె ఆసక్తిగా.

"వి. రామనాథంగారని—వారి అమ్మాయిని."

"రామనాథంగారంటే—మునిసిపల్ కచేరీలో ఉండేవారు ఆయనేనా ?"

"ఊఁ."

ఆమె వదనం సంభ్రమంతో వెలిగిపోయింది. "అయితే నువ్వు .... సావిత్రి కూతురువి కాదు గదా ?" అన్నది

"మా అమ్మ పేరు సావిత్రే" అన్నది సునంద తండ్రి చెప్పినది గుర్తు ఉన్నది గనుక.

"హాసి నీ ఇల్లు బంగారంగాను ! ఇలా దగ్గరకు రా" అని ఆమె సునందను దగ్గరకు తీసుకుని "ఎన్నాళ్లకు చూశానే నిన్ను ?" అన్నది ఆర్ద్ర నయనాలతో, హృదయంతో.

సునందకు ఆమె వాత్సల్యంలో, మాటలలో ఏదో కొత్తదనం గోచరించింది. అది ఆమె ఏనాడూ పొందిఉండలేదు అంతవరకూ. ఆ అనుభూతి ఆమెలో కొత్త ఊహలను కలిగించి, ఆలోచనా రంగంలో కొత్త ద్వారాలను తెరిచింది. ఆమె హృదయం పొంగిపోయి మంత్రముగ్ధురాలై పోయింది.

పార్వతమ్మగారు సునందను గుండెలకు హత్తుకున్నది. కన్నీటి ధారలతో ఆశీర్వదించింది. ఆవేశంతో పూడుకుపోయిన ఆమె కంఠం ఎంతసేపటికో గాని విడివడలేదు. విడివడిన తరువాత తనలో తాను అనుకుంటున్నట్లు "ఎన్నాళ్ల కెన్నాళ్లకి ?" అన్నది. సునంద ఏమీ ప్రశ్నించలేకపోయింది. ఆమెకీ సంఘటన ఆనందాన్నే ఇచ్చింది.

పార్వతమ్మగారు మెల్లిగా తన శరీరాన్ని, మనసును కూడదీసుకుని సునంద ఒళ్లు వాత్సల్యంతో నిమురుతూ "సావిత్రీ నేనూ ఒక్కటే ప్రాణంగా ఉండేవాళ్లం. ఆ రోజులే వేరనుకో. మీ తాతగారు, మా నాన్నగారు వియ్యంకుల వరసవాళ్లు. పైగా మాది పల్లెటూరు—ఇంటిపక్కనే ఇల్లు. అందుచేత ఎవరింట్లో ఏది జరిగినా ఉమ్మడిగానే నిర్వహించేవారు. అంతేనా ? మీ అమ్మ పెళ్లికి మా ఇంట్లో నెలరోజులపాటు ఏంపని చేసుకున్నాం కాదు. అహర్నిశలూ పప్పులు దంచడం ఏమిటి అప్పడాలు, ఒడియాలు పెట్టడం ఏమిటి—అంతా కథల్లో చెప్పినట్లు ఆకాశమంత పందిరి వేసి భూదేవి అంత అరుగు వేసినట్లు చేశారు మీ అమ్మమ్మా, మా అమ్మానూ. అప్పటికి నాకూ, సావిత్రికి పది ఏళ్లు. గ్రామం అని చెప్పానుగా ? అందరి ఆడపిల్లలమూ ఓ జట్టుగా ఉండేవాళ్లం. ఆ పెళ్లి పనులు ప్రారంభం అయేసరికి మిగతావారంతా ఒక జట్టూ, నేనూ సావిత్రీ ఒక జట్టూ కావలసి వొచ్చింది. వాళ్లంతా ఒకటే వేళాకోళాలు. మునసబుగారమ్మాయి సుందరి అని ఉండేది. ఉత్త రాలుగాయి దాని కిప్పుడు ఇద్దరు మనవలుట—అది వాళ్ల జట్టుకి నాయకురాలు. నేనొక్కర్తినీ ఎదురునిల్చి పోట్లాడేదాన్ని. అదంతా ఒక మధురమైన కాలం. ఆరోజు లిక రావు" అన్నది.

నిజమే ననిపించింది సునందకు.

ఆర్ద్రమైన నయనాలను చెంగుతో అద్దుకుని సునంద వోళ్లో చేతులు పెట్టి "దాని పెళ్లయిన ఏడాదికి నా పెళ్లి అయింది. కాపరానికి వెళ్లే నాటికి ఇద్దరికీ పద్నాలుగేళ్లు. ఆనాడు నన్ను గొడ్ల చావిట్లోకి లాక్కుపోయింది. నాకు ఈనాటికీ ఆరూపం గుర్తు. మొహం అంతా దుఃఖంతో ఉబ్బిపోయి నల్లే అయిపోయింది. వెర్రిపిల్ల. నాకూ మనసంతా గుబులు గుబులుగానే అయిపోయినా కాస్త రాతిగుండెదాన్ని గనక పళ్ల బిగువున దుఃఖాన్ని ఆపుకున్నాను. నన్ను కావలించుకుని వెక్కి వెక్కి ఏడ్చింది. నాకూ కన్నీళ్లు వచ్చినా అపుకుని "వూరుకోవే" అన్నాను ఇంకా గుండె చెరువు చేసుకుంటుందని. అది "మళ్లీ కలుస్తాముటే పార్వతీ" అన్నది డెక్కులు పట్టిన గొంతుతో. వెర్రిపిల్ల

ఎంత నోదార్చినా ధైర్యం తెచ్చుకుంది కాదు. చివరికి ఏమనుకుందో సంభాళించుకుని ఒక్కసారి నా రెండు చేతులూ పుచ్చుకుంది. "మన స్నేహానికి తుది ఉండదుగా ? ఆ మాటే అక్షయం కావాలి. నాకు మాటివ్వు పార్వతి ! నాకు కూతురు పుడితే అది నీ కోడలు. నీకు పుడితే అది నా కోడలు. ఈమాట హరిహరాదులు అడ్డమొచ్చినా తప్ప రాదు" అన్నది. ఆ మాటతో నాకూ దుఃఖం ఆగలేదు. ఒకళ్ల నొకళ్లు కావలించుకుని ఎంత సేవు ఏడ్చామో ? చివరికి తనచేత చేయి వేయించుకుని ఒదల్లేక ఒదల్లేక ఒదిలి వెళ్లిపోయింది" అన్నదామె.

సునంద కన్నులు చెమర్చాయి.

తండ్రి మాటల్లోనూ, గోడనున్న ఫోటోలోనూ తప్ప తనకు కనిపించని తల్లి ఆనాడు కనిపించినట్లయింది సునందకి. తల వొంచుకుని ఆమె సరసనే ఎంతోసేపు కూర్చుండిపోయింది. కొంతసేపటికి తిరిగి పార్వతమ్మగారు అన్నది : "ఆ తరువాత ఎన్నో సంవత్సరాలు గడిచిపోయాయి. నాకు రాజా పుట్టేసరికి కూడా దానికి పిల్లలు కలుగలేదు. వాడు పుట్టాడని ఉత్తరం రాస్తే "ఏడాది తిరిగేసరికి నీకు కోడల్ని కంటాను చూసుకో" అంటూ ఉత్తరం రాసింది. పెద్ద పండక్కి కలుసుకున్నప్పుడు వాణ్ని చూసి "మువ్మూర్తులా నీ పోలికే ! నీ నోటి దురుసుతనం ఒచ్చిందా వొళ్లు వాయగొట్టేస్తాను" అన్నది. ఆ తరువాత ఆమె కంఠం గాద్గదికమైపోయింది. "ఆ తరువాత రెండేళ్లకి కాబోలు అది నిన్ను కని పురిట్లోనే పోయిందని తెలిసి కృంగిపోయాను .... ఆనాటికీనాడు నిన్ను చూశాను" అన్నది.

సునందకు మాట పెగల్లేదు.

ఆనాటినుంచీ సునందకు ఆమె ఆప్తురాలై పోయింది. ఫెర్నాండేజ్ పర్మిషన్ తీసుకుని తన డ్యూటీ వేళల్లో ఆమెను ప్రత్యేకంగా చూసే అవకాశం కల్పించుకొన్నది. తాను పూర్తిగా కన్ను తెరవకముందే పోయిన తల్లి ఆమెలో అగుపించి ఆశీర్వదిస్తున్నట్లు ఉండేది ఆమెకు. ఒకనాడు ఆమె మాటల మధ్యలో "మీ నాన్న అప్పట్లో నల్లగా పొట్టిగా ఉండేవారు. ఉమ అని మా వూరి కరణం గారు కూతురు. అది 'పొట్టి విగ్రహం ఎప్పు డొస్తుందే ?' అని వేళాకోళం చేస్తే వూహూ ఉడుక్కునేది. ఒకతడవ నాతో రహస్యంగా "మా నాన్నకి బుద్ధి లేదే ! లేకపోతే ఆయనకి ప్రపంచంలో అంతకన్నా అందమైన అల్లుడు దొరక లేదా ?" అంటే నాకూ పెద్దగా వయస్సు లేదేమో —అనుభవం కూడా తక్కువాయిరి—తెల్లబోయాను దాని రాలుగాయితనానికి. అలాంటిపిల్ల పెళ్లైర్థం తిరిగేసరికి "ఆయనెంత మంచివా రను కున్నావు ? నా కాలు కదపనివ్వటంలేదు" అని ఉత్తరం రాస్తే వాళ్ల నాన్నగారూ, అమ్మగారూ అది చూసి ఒకటే నవ్వులు. ఆ తరువాత ఆ ఉత్తరం వాళ్లూ చూశారని తెలిసి నాతో అడాయి వేసుకుంది. ఉత్త బోళామనిషి .... ఎర్రగా, సన్నగా ఉండేది. మా అన్నయ్య సువర్ణశలాక అని పేరు పెట్టాడు. చక్రాలంతలేసి కళ్లు. అచ్చు నీ కళ్ల లాగానే. మొహం కూడా నీలాగానే కోల మొహం" అన్నది. ఆ తరువాత ఇంకా ఏం చెప్పేదో గాని ఆమె పెద్ద కొడుకు పాలూ, పళ్లూ తీసుకుని లోపలకు రావటంతో వెళ్లటానికి ఉద్యుక్తురా లయింది సునంద. అనాటివరకూ తనను అతనికి ఎరుక పరచని ఆమె సునందను వారించింది. "అలా పారి పోతావేమే పరాయిదానిలాగా ?" అని అతనివంక చూసి "మా సావిత్రి కూతురురా రాజా !" అన్నది.

"అలాగా ?" అన్నా డతను పళ్లూ పాలూ బల్లమీద పెడుతూ.

అదే మొదటిసారి సునంద అతడివంక చూడటం. అతను పూర్తిగా తల్లిపోలిక — కాటుక కళ్లూ, తమాషా అయిన నోరూను. మిగతా అంతా 'దొర బాబు' వ్యవహారం. పచ్చటి ఒళ్లు. ఒక పర పురుషుడిని, అందులోనూ అందగాడైన యువకుణ్ణి చూస్తున్నానన్న ఆలోచన రాంగానే తొట్రుపాటు కలిగి "ఒస్తాను అత్తయ్యగారూ" అంటూ బయటికి ఒచ్చేసింది. వెనకనుంచి ఆమె నవ్వూ 'వెర్రి పిల్ల' అన్న మాట పరిమళభరితంగా వినవచ్చాయి.

ఆ తరువాత ఒకరోజు రాత్రి మందు తీసుకుని ఆ గదిలోకి వెళ్లింది సునంద. రాజారావు అక్కడ లేడు. టెంపరేచరు రికార్డుచేసి మందు తాగిస్తుండగా సన్నగా, పొట్టిగా ఉన్న ఒక యువకుడు లోపలకు వచ్చాడు. నీరు కావిపట్టిపోయిన చొక్కా తొడుక్కుని, అలాంటిదే పంట్లాం తొడుక్కున్నాడు. ఎవరో బైతు, తెలియక ఒచ్చాడనుకుని "ఎవరయ్యా ?" అనబోయే టంతలోనే పార్వతమ్మగారు మందు గ్లాసు నోటినుంచి దూరంచేసి "వచ్చావా నాయనా ? ఇలారా" అన్నది సంభ్రమంగా. సునంద ఆశ్చర్యపోయింది ఎవరా అని. పార్వతమ్మగారు ఆ యువకుణ్ని గుండెలకు ఆదుముకుని వొళ్లంతా తడుముతూ "ఎంత చిక్కిపోయావు నాయనా ? అవున్లే ! అన్నంపెట్టే దిక్కయినా లేదు. రోగం ఒంక పెట్టుకుని నే నిక్కడ తగులడ్డాను" అని వాపోయింది.

"ఊరుకోమ్మా వూరుకో" అన్నా డతను.

'ఆమె రెండో కొడుకన్నమాట' అనుకున్నది సునంద. ఎంత తేడా ఇద్దరికీ ? ఒకరు సంపూర్ణ ఆరోగ్యంతో 'రాజెవడి కొడుకన్న' ధీమా గలవారు. మరి వీరో ? లోతుకు పోయిన కళ్లు, శుష్కించి పోయిన శరీరం, సంస్కారహీనమైన అవతారం. ఎందుకని ?

ఆ యువకుడు అలా తల్లి కౌగిట్లో ఉండగానే, రాజారావు లోపలకు వచ్చాడు. వెంటనే తెచ్చిన ఫ్లాస్కూ, పళ్లూ బల్లమీద పెట్టి "దొరగారెప్పుడో దిగారే ?" అన్నాడు సోదరుణ్ణి చూసి నవ్వుతూ.

"ఈ బండికే వచ్చా నన్నయ్యా" అన్నా డతను.

"తిండి తిన్నావుట్రా ?" అన్నది తల్లి.

అతను నవ్వి "తింటానమ్మా" అని అక్కడే నిలబడిపోయిన సునందవంక చూశాడు.

సునంద ఏదో గ్రహించి చటుక్కున "ఒస్తానండీ !" అని బయటకు వచ్చేసింది.

అతను ఒక్కరోజుకన్నా ఎక్కువ ఉండలేదు. వెళ్లిపోయేవేళ "ఒళ్లు జాగ్రత్త నాయనా. కాఫీ


The **new** plato 66

*at the old price*

**Rs. 4/-**

**The Plato-66 is now better than before with new features**

*** A new reflector clip for lasting spring action**

*** Reinforced nib-end for additional strength and service**

*Sign your next letter with PLATO and see the difference!*




Sole Distributors
BEST FOUNTAIN PEN DEPOT,
P. B. No. 2421, BOMBAY 2.

Shilpi M.P. 197

హోటల్లో వెధవ తిళ్లు తినకు" అని పసిపిల్ల వాడికి చెప్పినట్లు చెబుతోంటే అతనూ, అన్న గారూ కూడా నవ్వుకున్నారు. అతనిని గురించి సునందకి ఏమీ తెలిసే అవకాశం లేకపోయింది. రాజారావు మంచి ఉద్యోగంలోనే ఉన్నాడని అతని వాలకమే చెబుతున్నది. పార్వతమ్మగారు కూడా ఏదో మాటల సందర్భంలో అన్నది కూడా. మరి రెండో అతను ? అతని ఆరోగ్యం కూడా అంతంత మాత్రంగానే కనబడుతున్నది. అతని ఉద్యోగం అలాంటిదా ? ఈ సందేహా లన్నింటికీ సమాధానాలు పార్వతమ్మగారిని అడుగగల ధైర్యంలేకపోయింది.

అయినా సునందకు ఆ ఆలోచనలు విడిపోలేదు. రెండు మూడు రోజుల తర్వాత ఒకనాడు ఆమె రాత్రివేళ ఏమీ తోచక అనుపత్రి కారిడార్‌లో నిల బడి ఉండగా రాజారావు వచ్చి పలకరించాడు. పార్వతమ్మగారు అన్ని విషయాలూ మాట్లాడి తన రెండో కొడుకు సంగతి మాట్లాడక పోవటం తనలోని ఆసక్తిని మరింత రేకెత్తించినది. సునంద అతనిని ఆ విషయాలు అడగా లనుకున్నది. కాని సభ్యత ? పైగా పార్వతమ్మగారు చెప్పకపోవటానికి ఏదయినా బాధాకరమైన రహస్యం ఉన్నదేమో నన్న అనుమానం ఒకటి. అందుచేత అతను "హలో" అని పలుకరించినపుడు "నిద్ర రాలేదా ?" అన్నది.

"ఉహూఁ ! మీరు — నిద్రపోగూడదని కాబోలు" అన్నా డతను నవ్వుతూ.

"ఊఁ"

'ఇందాక ఒకసారి బయటకు వచ్చాను. ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూ కనిపించారు. ఏదయినా కొత్తరకం కేసు తగిలిందా ?"

సునంద కించిత్ సిగ్గుపడింది. "అబ్బే" అన్నది.

"ఫరవాలేదు చెప్పండి! కనీసం కాలక్షేపం."

సునంద మాట్లాడలేదు.

"స్వవిషయమైతే వద్దులెండి."

"ఇది మరీ బావుంది .... ఉండండి స్టౌ వెలిగిస్తాను. టీ తాగుదాం" అన్నదామె గదిలోకి దారి తీస్తూ.

రాజారావు ఆమె వెనకే గుమ్మందాకా వచ్చి నిలబడి "కొంపదీసి .... మా తమ్ముడి సంగతి కాదుగదా ?" అన్నాడు.

సునంద తొట్రుపాటును అణచుకుని "అలా ఎందు కనుకున్నారు ?" అన్నది స్టౌ వెలిగిస్తూ.

"ఈ రెండు మూడు రోజులబట్టి మీ వాలకం చూస్తుంటే అలా అనిపించింది. మీ ప్రశ్న అది బుజువు చేసింది." —

"అలాగా పాపం ?"

"అవును. కాదని గుండెలమీద చేయి వేసుకుని చెప్పండి."

సునంద అతని మాటలకి నవ్వుకున్నది. టీ కలపటం అయిపోయాక ఒక కప్పు అతనికి యిచ్చి "మీకు అభ్యంతరం లేకపోతే ఆ కుర్చీ అలా కారిడార్‌లోకి లాక్కోండి. అక్కడే అడుగుదురుగాని మీ యక్షప్రశ్నలు" అన్నది.

"ఓకే."

# మమత

టీ తాగటం ముగిశాక రాజారావు ముఖంలో నవ్వు చూసి "ఏమిటి నవ్వుతున్నారు ?" అన్నది సునంద.

"ఏంలేదు గానీండి .... సిగరెట్ కాల్చుకో వచ్చునా ?" అన్నా డతను.

"బూడిద అవతలికి దులిపితే."

"రక్షించారు" అని సిగరెట్ వెలిగించుకుని ఘాటుగా ఒక పీల్పు పీల్చి "ఇప్పుడు చెప్పండి. మీరు ఆలోచిస్తున్నది మావాడి సంగతి అవునా కాదా ?" అన్నాడు.

"ముందు మీ రెందుకు నవ్వుతున్నారో చెప్పండి" అన్నది సునంద.

"చెప్పాల్సిందే నంటారా ?"

"అన్నది అదే."

"అయితే వినండి .... ఆమధ్య ఏదో పుస్తకంలో చదివాను. ప్రియురాలి కెంపు. వన్నె చెక్కిళ్లలో, నవ్వినప్పుడు పడే సొట్టలో పడి మరణించటం కన్నా ప్రేమికుడికి ఆనందం లేదని."

ఒక ఆసామి : ఏమయ్యా, పోలీసు! అల్లా గోడదూకి ఒస్తు న్నారు; ఏమిటి విశేషం?

పోలీసు: ఏంచెయ్యమంటారు! ఇంటి యజమాని అద్దె కోసం గుమ్మంలో కూర్చున్నాడు.

కె. రంగారావు (మద్రాసు)

సునంద మొహం ఎర్రబడింది. "అదెందుకు?" అన్నది.

"ఏమో ? రాసిన కవికే తెలియాలి."

సునందకి అతని భావం అర్థంకాకపోలేదు. మాట మార్చడానికని "అత్తయ్యగారు నిద్రపోతున్నారా?" అన్నది.

"ఆ చప్పుళ్లేం ఉడకవు. మీరు ఆలోచిస్తున్న దేమిటో చెప్పండి."

సునంద ఉక్రోషంతో ఒక్క నిముషం ఆగి తరువాత మంద్రస్వరంలో "మీరు అనుకున్నది రైటే" అన్నది.

రాజారావు సిగరెట్ చివరి దమ్ము లాగి అవతలికి విసిరేశాడు.

"ఆయన .... ఏం చేస్తుంటారు ?"

"సినిమా హాల్లో టికెట్లిస్తాడు."

తెల్లబోయింది సునంద.

"అవును. వాడికి చదువు అంటలేదు. ఫోర్త్ ఫారం తప్పి ఇహ చదవనని మానేశాడు. ఇంట్లోనే ఆపనీ, ఈపనీ చేస్తుండేవాడు. చివరికి అలాగయితే గడవదని అందులో చేరాడు."

"మరి ఆయన ఆరోగ్యం ...."

"సినిమాహాల్లో ఉద్యోగం సునందగారూ ! రాత్రి ఇంటికి చేరేసరికి రెండూ, మూడూ అవుతుంది. తెల్లవారి ఎనిమిదింటికి లేచినా నిద్ర చాలదు. పైగా వేళపట్టున తిండి తినే బుద్ధి లేదు. మనిషి పాడయిపోయాడంటే పోడు మరి ?"

"పోనీ మానిపించేయక పోయారా ?"

"మరో దారి ?"

సునందకి జవాబు తోచలేదు..

"ఆయనంటే మీ అమ్మగారికి చాలా ప్రేమ."

"అవును."

సునంద ఏదో జ్ఞాపకం వచ్చి "మీరూ ఉద్యోగం చేస్తున్నారుకదా ? ఇద్దర్లూ ఎలా ఉండ గలుగుతున్నారు ?" అన్నది.

"లీవు ఉంది. అదీగాక ఎవరూ దగ్గరుండక పోతే ఎలాగ ? నాన్న పెద్దవాడయి పోయాడు."

"ఆయన వచ్చినట్లు లేదు."

"బాగా వయసయిపోయింది. ఇక్కడికొస్తే అవస్థ పడతాడని నేనే రావద్దన్నాను."

"అలాగా ?"

రాజారావు ఒక్క క్షణం ఊరుకుని "నాకు నర్సులంటే ఒక రకమయిన తమాషా అభిప్రాయం ఉండేది. అహర్నిశలూ రోగులమధ్య ఉంటారేమో —మందుల వాసన్లోనూ, నర్సింగ్‌లోనూ మామూలు మమతలూ, అనురాగాలూ విస్మరిస్తూ రఘుకునే వాళ్లని. మిమ్మల్ని చూశాక అది పొరపాటనిపించింది" అన్నాడు.

"నర్సులు మాత్రం మనుషులు కారా ?"

"కారుగా ?"

"మరి ఏమిటో ?"

"దేవతలు."

సునంద తన మందహాసం అతని కంట పడకుండా తల దించుకున్నది.

"నర్సింగ్‌లో చేరాలని ఎందు కనిపించింది మీకు ? సేవ చేద్దామనా ?"

"అంతంత పెద్ద మాట లెందుకుగాని, నాలో అంతర్గతంగా డాక్టరు కావాలన్న కోరిక ఉండేదను కుంటాను. అది కుదరదని తెలిశాక నర్సునయ్యాను."

"అదీ మాకు మంచిదే అయింది."

సునంద నునుసిగ్గుతో తల పక్కకు తిప్పుకుని "అబ్బా పన్నెం డయిందే ?" అన్నది చేతివాచీ చూసుకుని.

రాజారావు గ్రహించినట్లుగా లేచి "పోయి పడుకుంటాను. తెల్లారాక కనుపిస్తారుగా ?" అన్నాడు.

"ఎక్కడికీ పోనివ్వరుగా ?"

"ఎవరు ?"

"ఏమో ?"

నవ్వి "వస్తాను" అని చరచర వెళ్లిపోయా డతను.

రాజారావు వెళ్లిపోయిన దిక్కే చూస్తూ కూర్చుండిపోయింది సునంద. చంద్ర కిరణాలు మార్గం మారాయి. గాలి వీచడం మాని అప్పు డప్పుడు పన్నీటిజల్లులా ఒకటి, రెండు తరగలను పంపుతున్నది. ఆమెకు అప్రయత్నంగా చిరునవ్వు




# మమత

వచ్చింది. రాజారావు — అందగాడే కాదు, గడసరి కూడాను. అదే మరో మొగాడైతే అతి తెలివి తక్కువగా మాట్లాడి తన వేళాకోళానికి పాత్రుడయి ఉండేవాడు.

కుర్చీలో వెనక్కు వాలింది సునంద. ఆలోచనలు పార్వతమ్మగారి మీదకు పోసాగాయి. 'కలవాళ్ళు' కాదు వాళ్ళు. అయినా ఎంతటి ధీరోదాత్తత ? వయస్సు వెళ్ళిపోతున్నా ఆమెలో ఎంతటి హుందాతనం ! జన్మసంస్కారమో, లేక పెరిగిన పరిస్థితుల ప్రభావమో అది మరి ? జీవితం యాంత్రికంగా, మనిషి మరగా తయారవుతున్న ఈ రోజుల్లో ఆమె కుటుంబం స్వభావసిద్ధంగా ఎంతో నిజంగా ఉండగలగడం అదృష్టమే.

తన ఆలోచనలు తెలివితక్కువే అని ఎవరయినా అంటే కాదని వాదించగల శక్తి సునందకు లేదు. ఆమె ఏం చూసింది ? బుద్ధెరిగిన నాటినుంచీ తండ్రి తనకు సర్వస్వమూ అయినాడు. చదువులో ప్రవేశించినప్పుడయినా తనకు తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని చూడగల అవకాశం లేకపోయింది. అంటీ అంటనట్లుగా ఉండే తన తండ్రి తత్వమే తనకూ వంటబట్టిందేమో ! నర్సింగ్‌లో చేరటం కూడా కాకతాళీయంగానే జరిగింది. వివాహ ప్రసక్తి రాకపోలేదు గాని తనకెందుకో దానియందు ఆసక్తి కలుగలేదు. అది అయిష్టత కాదు. నిర్లిప్తత. ఆ తరువాత ఇందులో చేరింది. అందుకు కోపగించుకుని తండ్రి విజయవాడలో ఉన్న తమ్ముడి కొడుకు దగ్గరికి వెళ్ళిపోయాడు. రాజారావు అన్నట్లు ఈ బ్రతుకు ఒక రకంగా యాంత్రికమే. రోగులకు శుశ్రూష (అది ఆ పేర పిలువదగినదే అయితే) చేసేవేళ తాము అనే మాటలూ, చేసే చేష్టలూ పూర్తిగా హృదయాంతరాళాలలో నుంచి వచ్చేవికావు. రోగులపై గల జాలి ఆవగింజంత ఉంటుందేమో అందులో ? ప్రతి క్షణమూ ఏ తెలివితక్కువ నర్సో చేసే తప్పు మూలంగా తాము చేస్తున్నది విధి అనీ, బాధ్యత అనీ తెలుపుతూనే ఉంటారు అధికారులు. కొన్ని వందల రోగులను పరామర్శించే నర్సులకు వారిపై మమత కలగటం అంటే హాస్యాస్పదమేమో ! ఇవన్నీ సునంద అభిప్రాయాలు.

కాని ఈనాడు తన పరిస్థితి అదికాదు. సునంద స్వార్థం కూడా ఒకటున్నదని తెలుసుకుంటున్నది. ఆ స్వార్థంలో ఎంతో మాధుర్యమూ మరెంతో ఆనందమూ ఉన్నాయనిపిస్తున్నది. కాని ఇది ఇదమిత్థమని తేలడంలేదు. తేలిననాడు ......

ఆ సందేహం కలుగగానే సునంద ఉలిక్కిపడింది. ఒక్క క్షణం ఆమె శరీరం జలదరించింది. అది భయమో ? ఆశ్చర్యమో ?

ఆ రాత్రి అలాగే గడిచిపోయింది. మరునాడు ఆసుపత్రికి వచ్చి కారిడార్‌లో నడుస్తూండగా తన గదిలోకి వెళుతూన్న ఫెర్నాండజ్ ఎదురైనాడు. అతనూ యువకుడే. ఇరవై నాలుగు గంటలూ అతనికి ఆసుపత్రి తప్ప మరో ధ్యాస ఉండదు.

పదా హాసన్ముఖంతో రోగులను ఆకర్షిస్తాడతను. సునందను చూసి "వేళకాందే వోచ్చారే! రండి! లోపల కూర్చుందాం" అన్నాడు. సునంద అతని వెనకాలే అతని గదిలోకి వెళ్లింది. కూర్చున్నాక బల్లమీద ఉన్న టీ ఒక కప్పు ఆమె కిస్తూ "ఎలా ఉన్నది సిస్టర్ మీ బంధువులామె ?" అన్నాడతను.

"మీరు చూస్తూనే ఉన్నారుగా ?" అన్నదామె.

"అవును. చాలా కోలుకున్నది. త్వరలోనే త్వరలోనే ఆపరేషన్ చేసేయవచ్చు."

సునంద ఆ మాటతో కొంత ఆనందించింది. పార్వతమ్మగారి వ్యాధి అలాంటిది మరి. ఆమె టీ కప్పు బల్లమీద పెడుతుండగా గభాలున లోపలకు వచ్చిన మరో నర్సు "క్షమించాలి డాక్టర్! ఆ పదవ నెంబరు గదిలోని పేషెంట్ చాలా గాభరా పెట్టేస్తోంది" అన్నది.

ఫెర్నాండేల్ చివాల్న లేచి "పద!" అన్నాడు.

అతని వెనకే బయటికి వచ్చింది సునంద. పదో నెంబరు గది అంటే పార్వతమ్మగారు ఉండేది. సునంద అడుగులు కంగారుతో తడబడ్డాయి. ఆ గదిలోకి ప్రవేశిస్తుండగా లోపల్నుంచి ఏడుపు వినపడింది. ఫెర్నాండేల్ రాజారావును చూస్తూనే "ఏం జరిగింది మిస్టర్ ?" అన్నాడు.

రాజారావు ఖిన్నవదనంతో తలదాచుకొన్నాడు.

"నువ్వు చెప్పు సిస్టర్ ?" అన్నాడు చిరాకుగా ఫెర్నాండేల్.

ఆ రెండవ నర్సు రాజారావు వంకా, పార్వతమ్మగారి వంకా ఒక క్షణం చూసి "వారి రెండో అబ్బాయికి రక్తపు విరేచనాలు అవుతున్నట్లు ఉత్తరం వచ్చిందిట డాక్టర్" అన్నది.

ఫెర్నాండేల్ రాజారావు వంక కోపంగా చూసి "ఆ సంగతి ఆమెతో చెప్పారా ?" అన్నాడు.

రాజారావు సునంద వంక చూశాడు. అతని ముఖంలోని దైన్యమూ బాధా గమనించిన సునంద "నేను సరిచేస్తానులే డాక్టర్" అన్నది.

ఫెర్నాండేల్ పార్వతమ్మగారి వంక తిరిగి "మీరేం బాధపడకండమ్మా. అన్ని విషయాలూ చూసుకునేందుకు మేము ఉన్నాం" అని, రాజారావుతో "ఇలా రండి" అన్నాడు బయటకు దారి తీస్తూ.

రాజారావు అతని వెనకే కారిడార్‌లోకి వచ్చాడు.

"ఇకముందయినా, ఆమె బ్రతకాలని ఉంటే బాధ కలిగించేదేమీ ఆమెకు చెప్పకండి. అది ముఖ్యం."

రాజారావు తల వూపాడు.

ఫెర్నాండేల్ సునందను పిలిచి "ఇహ ఇది నీ బాధ్యత. జాగ్రత్త" అన్నాడు.

"అలాగే డాక్టర్" అన్నది సునంద.

ఫెర్నాండేల్ చరచరా వెళ్లిపోయాడు. కొంతసేపు పోయాక సునంద "ఏమని వచ్చిందేమిటి ఉత్తరం ?" అన్నది.

డాక్టర్‌చేత తిన్న చివాట్ల ప్రభావం నుంచి మెల్లిగా కోలుకుంటున్న రాజారావు "సిస్టర్ చెప్పిందిగా ?" అన్నాడు.

"ఆ సంగతి పనివేళా ఆమె కెందుకు చెప్పారు ?"

"మరేం చెయ్యమంటారు ? ముసలావిడ రోజుకి అరవైసార్లయినా వాడి సంగతి అడుగుతుంది. చెప్పక చావనా మరి ? పైగా అందులో ఇంత ...." అన్నాడు రాజారావు.

"సరేలెండి. ఇహనయినా అలా చెయ్యకండి."

అలా అనేసి సునంద పార్వతమ్మగారి దగ్గరకు వచ్చింది. ఆమె సునందను చూడగానే బావురుమన్నది. సునంద మందలింపు ధోరణిలో "అలా బెంబేలుపడి పోకూడదు. డాక్టరుగారు ఏమనుకుంటారు. ?" అన్నది.

"వాడి పాపిష్టి బ్రతుకమ్మా." అన్నదామె నిస్పత్తువగా వెనక్కి వాలిపోయి.

"అంత వెర్రిగా భయపడి పోతారేం ? బ్లడ్ మోషన్స్ ఎంతలో కడతాయి ?"

"నీకు తెలీదులే తల్లీ! వాడి గీత బాగుండకనే నాకీ మాయదారి రోగం సంప్రాప్తమైంది. ఆ మాయదారి ఉద్యోగం మానేసి వొచ్చెయ్యరా అంటే వాడు వినడు.

"ఫరవాలేదులెండి. డాక్టర్‌గారి నడిగి మంచి మందు పంపిస్తాను. అంతగా అయితే ఈయన ఒకసారి వెళ్లి చూసి వొస్తారు" అన్నది సునంద అప్పుడే లోపలకు వొచ్చిన రాజారావును చూస్తూ.

"వాడా ?" అన్నదామె నిస్పృహతో.

"ఏం ? .... ఏమండీ ? వెళ్లరూ ?" అన్నది సునంద.

రాజారావు నేలవంక చూస్తూ "ఎందుకు వెళ్లనూ వెళ్లమంటే ?" అన్నాడు.

సునందకి ఆమాట కాస్త చిరాకు కలిగించినా "ఇహ ఊరుకోండి. ఆయన వెళ్తారు" అన్నది పార్వతమ్మగారితో.

పార్వతమ్మగారు నిట్టూర్చి కళ్లు మూసుకున్నది. సునంద చేతిని తనమీద పెట్టుకుని రాస్తూ "వాడి గీత అలా చట్టుబండ లయింది. చదువుకోరా నాయనా అని చిలక్కి చెప్పినట్లు చెబితే విన్నాడు కాదు. పైగా ఆయనకి అతి గారాబం. పెద్ద ఘటాలం ఉన్నంతవరకూ ఎలాగో బతుకుతాడు. ఆ తరువాత ?" అన్నది తనలో తాను అనుకుంటున్నట్లు.

"అలాంటిమాట లనకండి. మీరు నూరేళ్లూ ఉంటారు." అన్నది సునంద.

పార్వతమ్మగారు కళ్లు తెరచి, నవ్వి, సునంద చెక్కిళ్లు పుణికి "బతుకుతాన్లేవే పిల్లా! నిన్ను కోడంట్రికం పెట్టొద్దూ ?" అన్నది బోళాగా.

సునంద కేమనాలో తోచక ఒక్క క్షణం ఉక్కిరి బిక్కిరై రాజారావు వంక చూసింది. పెదవుల చివర వెలుగుతున్న చిరు దరహాసంతో అతను క్రీగంటి చూపులు చూస్తున్నాడు.

సునంద తల వంచేసుకుంది.

"ఆసి నీ సిగ్గు బంగారంగానూ! మగరాయుడల్లే ఉద్యోగం చేస్తుంటివి. నీకు సిగ్గేమిటే ?" అన్నది పార్వతమ్మగారు మనసారా నవ్వుతూ.

సునందకు ఇహ అక్కడ ఉండటం దుర్భరం అనిపించింది. మొహం చేతుల్లో దాచుకుని పారిపోయే బేలతనం ఆమెలో లేకపోవచ్చును. కాని ఒక యువకుడి ఎదుట తనను గురించిన ఇలాంటి ప్రసంగం వస్తే ఇహ అక్క ఉండడం ఎలాగోడ అర్థం కాలేదు. లేచి వెళ్లిపోవటానికి సభ్యత అడ్డు


## ఆదాయము కావాలంటే



ఇంటింటా కుట్టు పని నేర్చి మీ సొమ్ము ఆదా చేయండి. నేర్చుకొనుటకు ప్రత్యేక గ్రంథం—అందరు టైలర్లే రు. 5/- 266 పే. 180 బొమ్మలు, అందమైన పుల్ క్యాలికో బైండు. బెతాయింపు రు. 3–50. కత్తిరింపులు రు. 1/–. రహస్య బోధిని రు. 0–62. ఈ 4 తెలుగు. వి. పి. అదనము. జి. పున్నారావుచౌదరి, మోపర్రు, తెనాలి తా.

## కుటికురా
## ఆయింట్‌మెంట్

చర్మరక్షణకు శతాబ్దానికి పైగా పేరు మోసింది.




నూటపది సంవత్సరాలు! ఇంతకాలంగా ప్రపంచమంతటా కుటికురా ఆయింట్‌మెంట్ ఉపయోగంలో ఉందన్న మాట!

కుటికురా ఆయింట్‌మెంట్ మచ్చలు తెచ్చే క్రిములను నాశనంచేస్తుంది. మూరేడు కాయలూ, మొటిమలూ, గజ్జి మొదలైన వాటిని రూపుమాపి అవి మళ్లీ రాకుండా చేస్తుంది. దీనిలోగల క్రిమిసంహార నూనెలు, ఒరపును, చమట పొక్కులను, పురుగుల కాట్లనూ నయంచేస్తాయి! కోతలూ, కాల్పులను మాన్పుతాయి.

**కుటికురా ఆయింట్‌మెంట్**

కుటికురా టాల్కం పౌడరు డబ్బా కొనండి — కుటుంబానికంతటికీ ఉపయోగపడే బహుళ వినియోగ టాల్కం పౌడరు



NATIONAL CO 300628

ఉపశమనకు ప్రత్యేకమైనది

కౌంతర్ డైన్



హెరాయిల్



బెంగాల్ కెమికల్
కలకత్తా
బొంబాయి
కాన్పూరు




కుటుంబం అంతటికి ఉపకరించే సముచితమైన సబ్బు

మార్గో సబ్బు



అతి నాజూకుగా, రమ్యమైన వాసనలీనే ఈ సబ్బు స్త్రీలకు, పిల్లలకు అతి మృదువుగా వుండే చర్మాన్ని పరిపోషించడంలో సాటిలేనిది. శుద్ధిచేసిన వేపనూనెతో తయారుచేసి, సుగంధ పరిమళాంతో మేళవించబడిన ఈ సబ్బు చర్మవ్యాధు లన్నింటినీ నివారించి, శరీరానికి వన్నె తేవడంలో ప్రసిద్ధికెక్కినది.

ది కలకత్తా కెమికల్ కంపెనీ లిమిటెడ్, కలకత్తా -

దక్షిణ ఇండియా ఆఫీసు: 5/149, బ్రాడ్వే, మద్రాసు—1.

# మమత

వస్తున్నది. మెల్లిగా పార్వతమ్మగారి నుంచి విడివడి తొందర తెలియకుండా "మళ్ళీ వస్తాను" అనేసి వడివడిగా బయటకు వచ్చేసింది.

బయటకు వచ్చాక ఆమె గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. ఆమెకు తెలియకుండానే, ఎక్కడి కయినా పోయి ఒంటరిగా కూర్చోవాలన్న ఆకాంక్ష ఆమెలో కలుగసాగింది. చీరెను సరిచేసుకుని కొన్ని అడుగులు వేసేసరికి ఫెర్నాండేల్ ఎదురై "ఆ కుర్రవా డేమయినా బాధపడ్డాడా ?" అన్నాడు.

సునంద "ఊఁ" అన్నది అయోమయంగా.

ఫెర్నాండేల్ "ఆ రాజారావు సంగతి ! .... నువ్వే మిటి ఇలా ఉన్నావు ?" అన్నాడు ఆశ్చర్యంగా.

సునందకు అప్పటికి కాస్త స్థిమితం కలిగింది మానసికంగా. "ఏంలేదు డాక్టర్" అన్నది.

"చూడు సిస్టర్ ! నువ్వు నర్సువి. నీకు డ్యూటీలో పొరపాటు రాకుండా చూసుకోవటం విధి. ఆ కుర్రవాడు కాస్త ఆవేశపరుడులా గున్నాడు. ఆమె టెంపరేచరూ, బ్లడ్ ప్రెషరూ ఎలాగో కంట్రోలయింది. అది తిరగబెడితే ?"

"మరి కాస్త శ్రద్ధ తీసుకుంటానులెండి."

"అంతేకాదు. ఇకనుంచీ ఆమెను సాధ్యమైనంత మవునంగా ఉంచాలి."

"అలాగే."

ఫెర్నాండేల్ వెళ్ళిపోయాడు. సునంద ముందుకు కదిలింది. ఆసుపత్రి అంతా దాదాపు నిశ్శబ్దంగా ఉన్నది. వార్డుల్లోనించి నర్సుల కంఠాలు సన్నగా మెల్లగా వినిపిస్తున్నాయి. బైటనున్న పూల మొక్కలమీద, లాన్ మీద శీతకాలపు చిరు ఎండ అందంగా పరుచుకున్నది. చెదిరిన ముంగురులను సర్దుకుని కారిడార్ మలుపు తిరిగిన సునంద ఎదురైన రాజారావును చూసి ఆగి "హలో" అన్నది.

అతనూ ఆగి "క్షమించండి. మా అమ్మ ఉత్త పూర్వకాలపుది. ఆమె మాటలు .... " అన్నాడు ఆర్ద్రోక్తిగా.

సునందకు సన్నని నవ్వు రాగా అది పెదిమల సందున బిగించి "ఏమిటంటారు ?" అన్నది. ఆ క్షణాన ఆమెకు ఇందాక కలిగిన గాభరా గుర్తు రాలేదు. అతని ప్రశ్న తెప్పించిన నవ్వు ఆ తలంపును అణగదొక్కిందేమో ?

"ఏమీ అనుకోవద్దని" అన్నా డతను ప్రాధేయ పూర్వకంగా.

"అనుకునేందుకేం లేదు .... అది పోనీయండి గాని మీ తమ్ముడిగారి సంగతి ఏమాలోచించారు ?"

"అలా లాన్లోకి పదండి. చెబుతాను" అన్నా డతను.

సునంద 'ఏమిటో అంత విషయం' అనుకున్నది. కూర్చున్నాక, రాజారావు తనపై రాలిన పున్నాగ పువ్వును వేలితో తిప్పుతూ "వెళ్ళమంటారా ?" అన్నాడు.

సునందకు చిత్రంగా తోచి "మరి ?" అన్నది.

"నాకు అభ్యంతరం లేదు. కాని అందువల్ల ప్రయోజనం ఉండదేమో ?"

"ఎందుకని ?"

"వాడు ఇంతకన్నా చెడిపోయేదేమీ ఉండదు,

నేను వెళ్లటం మూలాన మీకు మరింత శ్రమా నాకు కొంత డబ్బు వదలటమూ తప్ప మరేం జరుగదు.''

"మరి ఆయన జబ్బు ?"

"అది నయమవుతుందని నాకేం నమ్మకం లేదు.''

తెల్లబోయింది సునంద. రాజారావు ఉద్దేశ్యం ఆమెకు అర్థంకాలేదు. అది అంత గడ్డురోగం కాదే? కొన్నాళ్లపాటు సరైన తిండీ తిప్పలూ చూస్తే, మంచి మందు తింటే చాలు. ఎందుకి తను సందేహిస్తున్నాడు ?

"కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుంది. అయినా మీరు పరాయివారు కాదు గనక చెబుతున్నాను. వాడు నైతికంగా, పూర్తిగా దిగజారిపోయాడు. వాడు దర్శించని వెలయాలు కొంప లేదు. దానిమీద తెగ సిగరెట్లు కాలుస్తున్నాడు.''

"మీ రవి మాన్పించండి.''

"వాడేం పసిపిల్లవాడా ? కొట్టి చెప్పటానికి. అయినా ఆ ప్రయత్నం మేం చెయ్యలేదని మీరు ఎందు కనుకోవాలి ?''

సునంద జవాబు చెప్పలేకపోయింది.

"ఈ సంగతులన్నీ అమ్మకు తెలియవు. చెప్పేందుకు వీలూ లేదు. ఆవిడ మనసును ఎలాగైనా మీరే మరోవైపు మళ్లించాలి.''

"అంతే చెయ్యాలి మరి ?'' అన్నది సునంద గొణుక్కుంటున్నట్లు.

"మన ప్రయత్నం మనం చేద్దాం. డాక్టర్ గార్ని అడిగి మందు వ్రాయించండి. కొని పంపిస్తాను. ఆ తరువాత వాడి గీతా నా గీతా ఎలా ఉంటే అలా జరుగుతుంది ?''

"దానికేం ?''

రాజారావు లేచి "నేను అలా బజారువైపుకి వెళ్లొస్తాను.'' అన్నాడు.

"పదండి'' అన్నది సునంద తానూ లేస్తూ.

క్వార్టర్సుకి చేరుకునేంతవరకూ సునందకి రాజారావు మాటలే రింగుమనసాగాయి. ఇదన్నమాట కథ. రాజారావు తల్లికీ ఈ విషయాలు తెలిసే ఉండాలి. ఆ మాతృహృదయం ఎంత క్షోభ పడిపోతుందో ? ఫెర్నాండేల్‌గారి నడిగి మంచి మందు పంపించాలి. తన పిచ్చి గాని, పంపించినా అతను పుచ్చుకోకపోతే ? ఒక్క క్షణం ఆమెకు రాజారావు స్వభావ మీమాంస కూడా కలిగింది. ఏ నిర్ణయానికి రాగల అవకాశంలేదు మరి.

సునందకు పార్వతమ్మగారి వేళాకోళం జ్ఞాపకం వొచ్చింది. గతరాత్రి తనకు సమస్య అయి 'స్వార్థం' యొక్క స్వరూపం అవగతమైనట్లయింది. తాను మరొకరి సాహచర్యం కోరుతున్నది. అంతర్గతంగా తనలో ఆ కోరికే లేకపోతే ఆమె మాటలకు అంతగా చలించి ఉండేది కాదేమో?

అంతేకాదు. సహచరుని విషయంలో కూడా తనకు తెలియకుండానే మనసు కొన్ని నిర్ణయాలు చేస్తున్నది. ఆ నిర్ణయాల పర్యవసానం ఏమయినా అందువలన తనకు ప్రస్తుతంలో కనబడుతున్న వెలితి తీరిపోవచ్చును. ఒక కొత్తరకం జీవితం తనకోసం ఆనంద ద్వారాలను తెరుస్తున్నది.

ఆ రాత్రి డ్యూటీకి రాగానే తోటి నర్సు కాత్యాయని సునందను పక్కకు పిలిచి రహస్యంగా "నే విన్నది నిజమేనా ?'' అన్నది.

"ఏమిటి ?'' అన్నది సునంద అమాయకంగా.

"జాణతనం చూపించకోయ్ !——.. మేరీ అంతా చెప్పిందిలే.''

"దాని మొహం.''

"ఎవర్ని మొహమయినా, నీది ఇక్క డుండాల్సిన మొహం కాదు సునందా.''

"ఎందుకనో ?''

"నువ్వు ఆడదానివి, ఇంకా ఆ మనసు చావని దానివి గనక.''

"అయితే ఆడనర్సులంతా వ్యక్తిత్వం చంపుకుంటున్నా రంటావా ?''

"అందరూ కాకపోవచ్చు. ఒప్పుకోవాలంటే అభిమానం గాని మనలో ఎందరికి ఈ జీవితంమీద గౌరవం, ప్రేమా ఉన్నాయి ? నర్సింగ్‌ని బ్రతుకు తెరువుగా చేసుకున్నందువలన కలిగిన దుష్ఫలితం అది. రోజులు గడిచేకొద్దీ మనం మరలయిపోతాం.''

---

రామారావుకి చాలా మెడల్సు వచ్చాయ్. బాగా పరిగెత్తడని పేరున్నది. ఓసారి యింట్లో దొంగపడ్డాడు. అతను వాడి వెంటపడిగా వాడు పరిగెత్తాడు. కొంతసేపయ్యేసరికి రామారావు ఒక్కడేవచ్చాడు రొప్పుతూ. "అందుకోగలిగావా?" అనడిగారంతా. "అందుకోడమా! వెధవ ఏభైగజాలు వెనకపడ్డాడు తెలుసా!" అన్నాడు రామారావు గొప్పగా.

పి. జనార్దన్ (కడప)

---

"ఫరవాలేదు. కొద్ది రోజుల్లో కథలు రాస్తావు.''

"అదొక్కటే తక్కువ. పోనీగాని నిజం చెప్పు. ఏమయినా జరిగిందా ?''

"ఏమీ తేలడంలేదు కాత్యాయనీ ! అంతా అయోమయంగా కనబడుతోంది.''

"ఇష్టంలేదా ?''

"అదీ తెలియదు. ఉన్నదని అనిపిస్తుంది. వెంటనే ఎందుకో గుండె ద్రవించిపోతుంది.''

"అయితే నీకు ఇష్టమే నన్నమాట ?'' అన్నది కాత్యాయని నవ్వి.

"ఎలా ?'' అన్నది సునంద ఆశ్చర్యంగా.

"అంతేనోయ్ రాణి ! కావాలనిపించినప్పుడే కంగారు కలుగుతుంది..... అయితే మాకు కొద్ది రోజుల్లో డిన్నర్ అన్నమాట. వొస్తా'' అంటూ ఎవరో పిలువగా వెళ్లిపోయింది కాత్యాయని.

సునంద మెల్లిగా పార్వతమ్మగారి గదిలోకి వెళ్లింది. ఆమె సునందను చూసి తన పక్కన కూర్చోమని కాసేపు ఏవేవో మాట్లాడింది. చివరికి "ఈ రాజాగాడు చిన్నాడికి ఉత్తరం రాయాలని సాయంకాలమనగా పోయాడు. ఇంతవరకూ లేడు'' అన్నది.

సునంద ఆమె భావం గ్రహించి ఏమి మాట్లాడకుండా వూరుకున్నది.

"చిన్నాడిది గొప్ప బాధయిపోయిం దమ్మాయీ! ఏంచెయ్యాలో తోచడంలేదు.''

"మీరు అలా దిగులు పడకండి. మేమంతా లేమూ ?'' అన్నది సునంద.

పార్వతమ్మగారు గభాలున ఆమె చేతులు రెండూ పుచ్చుకుని దగ్గరగా లాక్కుని "ఏమన్నావే ? మళ్లీ అనూ ?'' అన్నది.

సునందకు నాలిక కొరుక్కునే వ్యవధానం కూడా లేకుండా పోయింది. తల వొంచుకుని "ఒకసారి అంటే చాలదూ ?'' అని.

"చాలునే రాణి చాలును. ఆ మాటకోసమే ఇన్ని ప్రశ్నలూ వేశాను .... చూశావా ? ముసలిదాన్నయినా నీకన్నా నేనే తెలివైనదాన్ని. నీచేత నాక్కావలసిన ముక్క అనిపించాను.

సునంద ఆమె మాటలకి నవ్వుకున్నది.

"నవ్వు నవ్వు. ఎన్నాళ్లు నవ్వుతావో నేనూ చూస్తానుగా ? రేప్పొద్దున్న అత్తగారి నయ్యాక ......'' అని ఆగి, సునంద ముఖాన్ని రెండు చేతుల్లోనూ పట్టుకుని "నా సావిత్రి కన్నీళ్లు పెట్టుకుంటే చూడగలనుటే ?'' అన్నది ఆనందావేశంతో.

సునంద కరిగి ఆమెపై వాలిపోయింది.

ఆ తరువాత రెండు మూడు రోజులు గడిచాయి. ఆ రెండు మూడు రోజుల్లోనూ తన చిన్న కొడుకు విషయం కనీసం నాలుగు వందల సార్లయినా అడిగిఉంటుంది పార్వతమ్మగారు. సునందకి ఆమెమీద జాలి వేసింది. రాజారావుమీద కించిత్ కోపం వొచ్చింది కూడా. తల్లడిల్లిపోతున్న ఆ మాతృ హృదయానికి ఎలాగ ఉపశమనం కలిగించటం అనే సమస్య ఆమెకు పరిష్కారసాధ్యం కాలేదు. పైగా రాజారావు ఎడల ఆమె కోపించుకున్నా అతని ప్రవర్తనలో అసాధారణమైనదేమీ కనిపించకపోవటం ఒకటి జరిగేది.

ఆ ఇద్దరికీ తల్లి అంటే విపరీతమైన ఆపేక్ష. అందులో విడ్డూరమైనదేమీ లేకపోవొచ్చును. కాని ఒక వయసు వొచ్చి, స్వశక్తిపై బ్రతుకుతున్నవాడు తల్లియెడల తనకు గల ప్రేమ ప్రకటించే పద్ధతి అలాగ ఉండదు. అనురాగానికి ఆయకట్టులు కట్టి జీవితంలోని మిగతా సన్నివేశాలలో వలెనే 'రిజర్వుడ్‌నెస్' అనుసరించేవా రున్నారు. తల్లి సరసన కూర్చోవటం అనాగరికత.

అలాంటి వూహాలు రాగానే సునందకు మరొక సందేహం కూడా కలిగేది. బద్ధానురాగులైన తల్లీ బిడ్డల నడుమ కోడలుగా అడుగుపెట్టే వ్యక్తి పరి

స్థితి ఎలాగుంటుంది ? వారి అనురాగానికి భాగస్వామిని అవుతుంది. అంతేకాదు. ఒక మహా ప్రవాహాన్ని పాయలుగా చీల్చినట్లుగా, ఆ అనురాగాన్ని కూడా చీల్చవలసివొస్తుంది. దాని పరిణామాలలో ఒక మాధుర్యమూ, మరొక వేదనా రెండూ ఉంటాయేమో ? లేక సర్వ మానవత్వానికీ పూజనీయమయిన 'ప్రేమ' విశ్వరూపం ధరించి ఆమెకూ తన నీడను ఇస్తుందేమో ?

ఏమయినా సునంద ఆ జీవితాన్ని మనసారా కోరుకోసాగింది. రాజారావు కన్పించినప్పుడల్లా ఆమెకు శరీరంలో చిత్రమైన కంపన కలిగేది. ఆ కంపన ఎంత మధురంగా ఉండేదీ అంటే అమె నిరంతరమూ అది కలగాలని కోరుకోసాగింది. ఎల్లవేళలా అతని రూపం మనసులో నిలిచి మధుర భావనలను మోసులెత్తించసాగింది.

ఆనాడు ఆమె యథాప్రకారం పార్వతమ్మగారి దగ్గరకు వొచ్చింది. అధికంగా ఆమె మాట్లాడటం మంచిది కాదని డాక్టరు చెప్పినప్పటినుంచీ సునంద అందుకు తగిన జాగ్రత్త వహిస్తూనే వొచ్చింది. ఆనాడు పార్వతమ్మగారు సునందను చూసి చిరునవ్వు నవ్వి వూరుకుంది. ఆ చిరునవ్వులో మునుపటి కళా కాంతి లేవు. సునంద కది అర్థంకాలేదు. రాజారావు కిటికీదగ్గర కూర్చుని బయటికి చూస్తున్నాడు. ఆ తల్లీ కొడుకు లిద్దరూ ఏదో విషయం మీద వాదులాడుకుని ఉండాలని గ్రహించిన సునంద ఏంచెయ్యాలో తోచక వూరుకున్నది. రెండు మూడు నిముషాలు గడిచాక పార్వతమ్మగారు ప్రస్తావన అంటూ లేకుండా "నా బాధ ఎవరికి తెలుస్తుంది ? అయినవాళ్ళు పట్టించుకోరు. కాని వాళ్ళకి తెలియదు" అన్నది.

"పట్టించుకుని ఏం చెయ్యాలంటావు ?" అన్నాడు రాజారావు ఆవేశాన్ని దిగమింగుతూ.

"నువ్వేంచేస్తావు నాయనా ? నువ్వేం చెయ్యలేవు. అంతా నా ఖర్మ."

"ఖర్మం కాదు. చాదస్తం."

"పోనీలే ! అయినా నాకు ఈ వైద్యం అక్కర్లేదు. ఇంటికొచ్చేస్తాను. తీసుకువెళ్ళు."

"అలాంటిదేం కుదరదు" అన్నాడు రాజారావు నిష్కర్షగా.

సునందకి ఆ ధోరణి కాస్త వింత గనిపించినా రాజారావు మాటల తీరు కూడా నచ్చక వూరుకున్నది. జీవితంలోని ప్రతి విలువకీ స్థానాల మార్పిడి ఉంటుంది. అదే జరుగకపోతే బ్రతుకు కష్టమై అశాంతి ఏర్పడుతుంది. ఆ సంగతి అందరూ గ్రహించాలి. అందుకే కొంతసేపు తరవాత ఒంటరిగా రాజారావు కలిసినప్పుడు "నా మాట విని మీ తమ్ముడుగారిని పోయి తీసుకురండి" అన్నది.

"ఇహ నేను చెప్పేదేముంది ?" అన్నా డతను.

"ఏమీ చెప్పొద్దు. ఆపని చెయ్యండి. ఆవిడ ఆవేశం తగ్గించుకోవాలి. అందుకు ఇది ఒక్కటే మార్గం."

"అవును మరి ! అందరూ ఆ సంగతే చెబుతారు. ఒక్కరూ నా సంగతి ఆలోచించరు" అని రెండు చేతులూ జోడించి "క్షమించండి సునంద గారూ ! నే నిహ ఏమీ వినదల్చుకోలేదు." అంటూ చరచర వెళ్ళిపోయాడు రాజారావు.

సునంద అతని భావాన్ని అర్థం చేసుకుని ప్రమాన్పడిపోయింది. అది నిజమేనా ? ఎంత కఠోరమైన సత్యం అది ? అది సహజమా ? అయితే ఎంత దారుణమైన సహజత్వం ? మంచి చెడుల మధ్య తేడా అంత సన్ననిదీ చిన్నదీనా ?

సునంద మనసు స్తబ్ధమై పోయింది. ఆలోచన అనేది మనిషి కెంత అవసరమో అంత అనవసరం కూడా మరి. ఆమెకు వొళ్ళంతా గలబరింత వొచ్చినట్లయింది. ఇంటికి పోయి నిస్సత్తువగా కూలబడిపోయింది. కొంతసేపటికి మెల్లిగా లేచి యాంత్రికంగా పనులు ముగించుకుని ఆసుపత్రికి బయలుదేరబోయిన సునంద ఎదురైన వ్యక్తిని చూసి నవ్వుతూ పలకరించబోయి అతడి వాలకం చూసి "లోపలకు రండి" అన్నది దడదడ కొట్టుకుంటున్న గుండెలతో.

రాజారావు వొణుకుతున్న చేతులతో జేబులో నుంచి ఓ కవరు తీసి ఆమె చేతిలో ఉంచాడు. అది ఒక టెలిగ్రామ్. అందులో—

'సుందరం పోయాడు. వెంటనే రా' అని ఉన్నది.

* * *

ఆలోచనా తరంగాలు అక్కడితో ఆగిపోగా సునంద శరీరం ఒక్కసారి ఝల్లుమన్నది. ఈ వార్త ఆ వృద్ధురాలికి తెలియరాదని ఫెర్నాండేల్ ఆనతి. అవును మరి. అది తెలిసిన మరు క్షణానే ఆమె గుండె బద్దలవుతుంది. అందుకని . . . . .

సునంద గట్టిగా కళ్ళు మూసుకున్నది.

ఆ రాత్రి భారంగా, మగతగా గడిచిం దామెకు.

మర్నాడు మధ్యాహ్నం మూడు గంటలకు యథాప్రకారం ఆసుపత్రికని బయలుదేరింది సునంద. ఆకాశం మబ్బులు పట్టటాన వాతావరణం చల్లగా ఉన్నది. చల్లని చిరుగాలి కూడా వీస్తున్నది. వర్షం వొచ్చే సూచనలు అగుపడగానే సునంద మనసు అప్రయత్నంగా కొంత తేలిక పడింది. ఆసుపత్రికి వొచ్చినవారి తాలూకు పిల్లలు కాబోలు—ఇద్దరు ఆడపిల్లలు మెట్లమీద కూచుని రాబోయే వర్షాన్ని తలుచుకుంటూ ఆకాశంవంకా అక్కడ ఉన్న వివిధాలయిన మొక్కలవంకా చూస్తూ తమలో తామే మెల్లగా "వానా వానా వల్లప్ప" అని పాడుకుంటున్నారు. సునంద సన్నగా నవ్వుకున్నది. మధురమైన బాల్యస్మృతులు ఎదను కదిలిస్తుండగా మందగమనంతో పార్వతమ్మగారి గదికి వొచ్చింది. లోపలకు అడుగు పెడుతూనే పార్వతమ్మగారి ముఖంలోని గంభీరతను, కిటికీ వద్ద కూచుని బైటికి చూస్తున్న రాజారావునూ చూచి, మామూలు ప్రకారం ఏమీ అనకుండా, అక్కడ ఉన్న కుర్చీని మంచందగ్గరకు లాక్కుని కూర్చున్నది నిశ్శబ్దంగా, మౌనంగా.

కొద్ది క్షణాలు గడిచిన తరువాత "నాకొక సహాయం చేస్తావా అమ్మాయీ ?" అన్నది పార్వతమ్మగారు పొడిగా.

"చెప్పండి" అన్నది సునంద.

"మా వూరు పోదామనుకుంటున్నాను. రైలెక్కించు."

సునంద ఆ తల్లీ కొడుకు లెందుకో వాదులాడుకున్నారని తెలుసుకున్నది. అయినా ఆ సంగతి బైటపడటం ఇష్టంలేక "నామీద కోపం వొచ్చిందా ?" అన్నది లాలనగా.

"నువ్వు రైలెక్కిస్తావా లేదా ? ఆ సంగతి చెప్పు." అన్నదామె సూటిగా.

సునంద ఇక లాభంలేదని "చూడండి ! మీరు కూడా అలా పసిపిల్లల్లా మాట్లాడితే ఎలా.... అన్నీ మర్చిపోయి హాయిగా విశ్రాంతి తీసుకోండి" అన్నది.

"సన్నాయి నొక్కులు నొక్కకే పిల్లా ! ఆమాత్రం నాకూ తెలుసు."

"మరి ఎందుకంత తొందర ? రోగం పోనక్కర్లేదా ?"

"రోగం కాదు మిత్తవ ! ఇది నేను బతికుండగా పోదు."

సునంద రాజారావు వంక తిరిగి "అలా నిల్చుంటా రేమండీ ? పోయి డాక్టర్‌గార్ని పిలుచుకురండి" అన్నది కోపంగా.

రాజారావు తల్లివైపు తిరిగి కోపంగా "నువ్వు నోరుమూసుకుని పడుకొంటావా లేదా ?" అన్నాడు.

"ఎందుకు మూసుకోవాలిరా ? నువ్వేం నన్ను పోషిస్తున్నావా ?" అన్నది రెచ్చిపోయి.

"నేనే పోషిస్తున్నాను."

"ఛ ! ఏమిటండీ ఆ మాటలు ?" అన్నది సునంద.

"లేకపోతే ఏమిటండీ ? ఇరవై నాలుగు గంటలూ ఆ వెధవ పాట తప్ప మరేమీ లేదాయె" చిరాగ్గా అన్నాడు రాజారావు.

'వెధవ గనక వాడి బ్రతుకలా తెల్లవారింది."

ఆ మాటతో పార్వతమ్మగారి ఆవేశం కట్టలు తెంచుకున్నది. లేచి మంచంమీద కూచుని తార స్థాయిలో "వాడి బ్రతుకేంరా ? నీలాగా సూటూ బూటూ లేకపోతే సరా ? మనసు బంగారం. ఛీ ! నీలాంటివాడు .... " అన్నది.

"అందుకే .... " అన్నాడు రాజారావు రెచ్చిపోయి.

"ఏరా ? వాడికేం ?"

"ఏమా ? .... చచ్చి స్వర్గాన ఉన్నాడు." అన్నాడు రాజారావు పట్టరాని ఆవేశంతో.

పార్వతమ్మగారి శరీరం ఆ మాటతో విద్యుద్ఘాతం తగిలినదానిలా గజగజ వొణికిపోయింది. ఆ వెంటనే రాజారావు "కావాలంటే సునంద నడుగు" అన్నమాటతో ఆ వార్త నిజమేనని రుజువై పోయింది. కళ్ళు పెద్దవై పోయి, భయంకరమైన వెర్రికేకొకటి పెట్టి విరుచుకు పడిపోయింది.

సునంద !

తన కన్నుల ఎదుట కొద్ది క్షణాల వ్యవధిలో జరిగిపోయిన ఈ విపత్తు ఆమెను స్తంభితురాల్ని చేసివేసింది. సర్వేంద్రియాలూ చైతన్యాన్ని కోలుపోగా ఆమెకు సర్వమూ అంధకారమయమే అయిపోయింది.

పార్వతమ్మగారి కేక వినిపించి ఆదరా బాదరా పరుగెత్తుకొచ్చిన ఫెర్నాండేల్ ఆమె విరుచుకు పడిపోవటం కళ్ళారా చూసి వెంట వచ్చినవారి సాయంతో ఆమెను స్పెషల్‌రూమ్‌కు తీసుకు వెళ్ళిపోయాడు. ఏం జరిగిందో అంతుపట్టక గుమ్మం దగ్గర నిలబడి పోయిన పక్క గదుల రోగుల తాలూకు బంధువర్గం శిలాప్రతిమలా కూచుండి పోయిన సునందనూ, గదిలో ఓ మూలగా కుర్చీ



## పుష్పము మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ,మీ సరియైన చర్యను గురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన మీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేదీ, వేళవివరములున్నూ, మీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసిపంపండి. జ్యోతిషశాస్త్రములోని రహస్య గణితము మూలముగామేము గుణించి, మీరు కార్డు వ్రాసినతేదీ లగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము,ఏ వ్యవహారములోమీకు జయము కలుగునో, ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు,మార్పులు,ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగువానిని గురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు.1.25న. పై. లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. ఛార్జీలు ప్రత్యేకం). దుష్టగ్రహములేవైనా ఉన్నయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా లేనిఎడల పైకము వాపసు. చేయబడును. ఒకసారి పరీక్షించండి. అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

**Pt. Dev Dutt Shastri, Raj Jyothishi (W. P.) JULLUNDUR CITY.**



ఆహార లోటువల్ల మీరు నీరసించిపోతున్నారా?

**ఆల్బో-సాంగ్ సేవించండి**

దివ్యమైనది మరియు
సామాన్య పోషక ఆహారమును పొదుపుగాను
వైజ్ఞానికంగాను బలపరచును.

టీ, కాఫీ, పాలు, గంజి, పళ్ల రసం మొదలైనవాటితో కలిపితే ప్రీతైన రుచిగలది. ఆల్బో-సాంగ్, శిశువులకు, ఎదిగే పిల్లలకు, చంటి బిడ్డ తల్లులకు, మెదడునుపయోగించే పనివారికి, వృద్ధులకు, బలహీనతకు, రక్తహీనతకు మరియు రోగ విముక్తులై కోలుకుంటున్న వారికి, దివ్యమైనబలవర్ధక ఆహారము.




పౌడర్ గాను, బిళ్లలుగాను దొరుకు చున్నది.

**జె. అండ్ జె. డిషేన్**
హైదరాబాద్


## మమత

కుళ్లి ఏడుస్తూ కూలబడిపోయిన రాజారావునూ చూసి, వూహాగానాలు చేస్తూ తప్పుకోసాగారు. ...ద్ది నిముషాలకి సునంద తిరిగి చైతన్యవంతురాలైంది. ఉస్సురుమని కుర్చీలో వెనక్కు ...లిపోయింది. శరీరమంతా చెమట పట్టేసింది. తరువాత కొద్ది క్షణాలకు ఎవరో తట్టినట్లయి ...మెల్లిగా కళ్లు తెరిచిందామె.

"పద సునందా ?" అన్నది మేరీ.

సునందకు ఆమె ఏమంటోందో అర్థంకాలేదు. ... సంగతి అనటానికి పెదిమెలు విడలేదు.

"లే పోదాం" అన్నది మేరీ తిరిగి.

సునంద కళ్ళు నీటితో నిండిపోయాయి. మనసు ...రువెక్కిపోతుంటే మేరీని కౌగలించుకుని, వెక్కి వెక్కి ఏడ్చింది. మేరీ వాత్సల్యంగా ఆమెను నిమురుతూ "వూరుకో! వెర్రిపిల్లా" అన్నది.

సునంద మేరీ ఆసరాతో లేచి నిలువబడింది. ఆ సమయంలో ఆమె మనసులో క్రోధాలూ, రోషాలూ, ద్వేషాలూ ఏమీలేవు. ఉన్నది ఒకే ఒక అనుభూతి. అది దిగంతాలకు విస్తరించుకుని భయంకరమైన సన్నివేశాలలో అందరినీ ఆదుకునే ఏకైక శక్తి.

అది నిస్పృహ, స్తబ్దత.

ఈ పరిసరాలు, ఈ లోకం ఇవేమీ ఆమెకు అవసరమనిపించలేదు. అన్నింటికీ దూరంగా ఎక్కడికో పోవాలి. తన కిప్పుడు కావలసింది ఏకాంతం.

సునంద ముందుకు అడుగు వేయబోయి, గదిలో మూలగా నిలుచునివున్న రాజారావును చూసి, ఆగిపోయింది. అతని ముఖం ఉబ్బిపోయి ఉన్నది. చెంపలు కన్నీటితో తడిసిపోయాయి. తనవంక సునంద చూడగానే అతను తలదించుకున్నాడు.

సునంద ఒక్కక్షణం ఏమీ మాట్లాడలేదు. ఆమెకు ఆక్షణాన అతనిమీద ఏలాంటి కోపమూ కలుగలేదు. అతనా క్షణాన చేసినది సహజమేనేమో ? ఏమో? ఏమిటి? సహజమే! ఈ లోకంలో అందరికీ కృతజ్ఞత కావాలి. అతనూ కావాలనుకున్నాడు. అందులో అతని తప్పేమున్నది?

సునంద తిరిగి అతనివంక చూసింది. ఈసారి అతను తలదించుకోలేదు. అతనిముఖంలో బాధ ఉన్నది. వేడికోలు ఉన్నది. పశ్చాత్తాపం ఉన్నది. సునందకు ఎందుకో చిరునవ్వువచ్చింది. అది దాచుకోలేదు. కొద్దిక్షణాలకి మేరీ భుజంమీది చేయి గట్టిగా నొక్కుతూ "వెళ్తున్నాను" అన్నది మెల్లిగా.

రాజారావుకు ఏమనాలో తోచలేదు. అతనికి కొంత ధైర్యం మాత్రం వచ్చింది. సునంద తనను అసహ్యించుకోలేదు. ఆ ధైర్యం శక్తినీయగా "మళ్ళీ వస్తారుగా?" అన్నాడు..

సునందకు మళ్ళీ ఇందాకటి నవ్వు వచ్చింది. అతని ముఖంలోకి సూటిగా చూసి, "ఇక రానుగా?" అన్నది ముందుకు కదులుతూ.

ఆ జవాబుకి రాజారావూ, మేరీ-ఇద్దరూ ఆశ్చర్యపోయారు. ఆ క్షణాన రాజారావుకు ఒక సత్యం తెలిసివచ్చింది. ఆ సత్యం మేరీ కూడా తెలుసుకున్నది.

★